TGTEL/26/A0372

మన మహాతి న్యూస్

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | సోమవారం జూన్ 01, 2026 | సంపుటి : 01 | సంచిక : 123 | పేజీలు 5 | వెల-2/- | MANAMAHATINEWS.COM

అవి భారతీయులకు గర్వకారణం..

అనైమంగళం రాగి శాసనాలపై ప్రధాని మోదీ

- గుర్విందర్, అనిమేష్‌కు మోదీ అభినందనలు.
- 100 మీటర్ల పరుగులో కొత్త రికార్డులు.
- అనైమంగళం శాసనాలు భారత్‌కు తిరిగి వచ్చాయి.
- డాల్ఫిన్ రక్షకులను ప్రశంసించిన ప్రధాని.
- డాల్ఫిన్ అంబులెన్స్ సేవలపై ప్రశంసలు.
- ఎండలపై జాగ్రత్తలు పాటించాలని సూచన.
- మజ్జిగ, షర్బత్ వంటి పానీయాలు తీసుకోవాలని సూచించారు.

భారత అథ్లెట్ గుర్విందర్ సింగ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల గురించి ఆదివారం మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వందమీటర్ల పరుగులో రికార్డులు సృష్టించిన అథ్లెట్లు గుర్విందర్, అనిమేష్‌తో ఆయన నేరుగా మాట్లాడారు.

కేవలం రెండు రోజుల్లోనే 100 మీటర్ల పరుగు పందెంలో జాతీయస్థాయిలో మూడు రికార్డులు సృష్టించామని మోదీ అన్నారు. ఈ అద్భుతమైన ఘనత సాధించిన ఇద్దరు అథ్లెట్లు గుర్విందర్ సింగ్, అనిమేష్‌కు అభినందనలు తెలిపారు. మోదీ పర్యటన నేపథ్యంలో 'అనైమంగళం' రాగి శాసనాలను నెదర్లాండ్స్ ప్రభుత్వం భారత్‌కు తిరిగి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇది భారతీయులు గర్వించదగిన విషయమని మోదీ అన్నారు. ఇక, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ కాలువల చిక్కుకుపోయిన డాల్ఫిన్‌ను కొందరు దాదాపు 13 గంటలపాటు శ్రమించి రక్షించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే అభిషేక్ బెనర్జీపై దాడికి కారణం: భాజపా

- అభిషేక్ బెనర్జీపై దాడి వెనుక టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే కారణమని భాజపా ఆరోపణ.
- అరెస్టైన నిందితులు మాజీ ఎమ్మెల్యే లవ్లీ మొయిత్రా అనుచరులేనని భాజపా వ్యాఖ్య.
- టీఎంసీపైనే ప్రజాగ్రహం వ్యక్తమవుతోందని అగ్నిమిత్ర పాల్ అన్నారు.
- టీఎంసీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడిందని భాజపా విమర్శ.
- రాష్ట్ర అభివృద్ధికి కలిసి పనిచేయాలని పిలుపు.

2లో

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల

రాజమహేంద్రవరం: ఇరిగేషన్‌పై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు ఆయన సాగునీరు విడుదల చేశారు. మంత్రి దుర్గేష్‌తో పాటు కూటమి ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. గోదావరికి జలహారతి ఇచ్చి.. మీట నొక్కి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు నీటి విడుదలతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యా వికాస పునర్నిర్మాణానికి నడుం బిగించాం: సీఎం రేవంత్

హైదరాబాద్: పాఠశాల విద్యలో తెలంగాణ పనితీరు గణనీయంగా మెరుగుపడిందని కేంద్ర విద్యాశాఖ.. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో పేర్కొనడం తమ ప్రభుత్వ రెండేళ్ల కృషికి నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధికి తొలి కొలమానం విద్య అని చెప్పారు. విద్య ఒక్కటే పేదరికాన్ని నిర్మూలించి, సమాజాన్ని జాగృతం చేయగలదని తాను బలంగా విశ్వసించినట్లు తెలిపారు. ఆ దిశగా ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విద్యాశాఖ బాధ్యతలు స్వయంగా తీసుకుని.. రెండేళ్లుగా తెలంగాణ మోడల్ స్కూళ్ల ఏర్పాటు, నూతన ఉపాధ్యాయుల నియామకం, డిజిటల్ విద్యకు ప్రాధాన్యం, ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ సదుపాయం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, డ్రాపౌట్ల నియంత్రణ వంటి అంశాలపై బలమైన కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు.

పదేళ్లలో జరిగిన విద్య విధ్వంసం నుంచి విద్యా వికాస పునర్నిర్మాణానికి నడుం బిగించామన్నారు. తాజా ఫలితాలతో సంతృప్తి పడట్లేదని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం పూర్తయి.. భవిష్యత్‌లో ఈ పాఠశాలలు దేశ విద్యా వ్యవస్థలో తెలంగాణ స్థానాన్ని నెంబర్ వన్‌గా నిలబెడతాయన్న విశ్వాసం ఉందన్నారు. ఆ లక్ష్య సాధన దిశగా కేంద్ర నివేదికలో పేర్కొన్న ఫలితాలు ప్రేరణ ఇచ్చాయని సీఎం తెలిపారు.

ఆన్‌మార్క్ పోర్టల్..

లోపాలు పరిశీలిస్తున్నాం : సీబీఎస్ఈ

ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియపై వివాదం నేపథ్యంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఎట్టకేలకు మౌనం వీడింది. ఈ పోర్టల్‌లో వెలుగు చూస్తున్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొంది. ఈ వ్యవస్థను పటిష్టం చేయడానికి సైబర్ సెక్యూరిటీ నిపుణుల బృందం కొన్ని రోజులుగా పనిచేస్తోందని, ఇప్పటివరకు గుర్తించిన సమస్యలను సరిచేసిందని తెలిపింది. పేజి 2లో ▶

ట్రాక్టర్ నడిపి..

పొలం దున్నిన మంత్రి నిమ్మల రామానాయుడు

- మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేశారు.
- 7 కి.మీ. సైకిల్ తొక్కి అగర్తిపాలెం చేరుకున్నారు.
- రొయ్యల చెరువును పరిశీలించి మేత వేశారు.
- ట్రాక్టర్ నడిపి పొలం దుక్కిదున్నారు.
- రైతులు వరి నాట్లకు సిద్ధం కావాలని సూచించారు.
- జల సంరక్షణపై ప్రత్యేకంగా పిలుపునిచ్చారు.

పాలకొల్లు మార్కెట్, పాలకొల్లు గ్రామీణం: ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామంలో వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం పాలకొల్లు నుంచి ఏడు కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ అగర్తిపాలెనికి చేరుకున్నారు. దారి పొడవునా ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సొంత రొయ్యల చెరువులో మేత వేసి.. రొయ్యల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నారు. పేజి 2లో ▶

రైతు డిస్కం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం: కేటీఆర్

హైదరాబాద్: రైతు డిస్కం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి గతంలో సాగుకు రోజుకు 3 గంటల విద్యుత్ చాలన్నారు. ఇప్పుడు మాటమార్చి రైతు డిస్కం ఏర్పాటు చేస్తామంటున్నారు. రైతు మెడకు ఉరి పెట్టే డిస్కం అది. కంటోన్మెంట్ ఉప ఎన్నిక సమయంలో స్థానికంగా ఆరు వేల ఇళ్లు కట్టిస్తామన్నారు. ఇప్పటి వరకు ఆరు ఇళ్లయినా కట్టించారా? రేవంత్‌రెడ్డి 420 హామీలు అమలు చేసి చూపించాలి. కేసీఆర్ అప్పులు చేసి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారు. రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రైతు డిస్కం..

7 గంటలే విద్యుత్ ఇచ్చేలా కుట్ర: హరీశ్‌రావు

2లో

రైతు డిస్కం ఏర్పాటు వెనుక కుట్ర ఉంది: కవిత



2లో

మృతుడు కండక్టర్ శంకర్ కుటుంబాన్ని పరామర్శించిన మిత్ర బృందం లావుడియా రాజు నాయక్ రఘుపతి రాజయ్య రవి రాజేశ్వరరావు శ్రీనివాస్.

ములుగు జిల్లా మే 31 న్యూస్

పరకాల డిపోకు చెందిన కండక్టర్ శంకర్ విధి నిర్వహణలో భాగంగా పరకాల డిపో నుండి బస్సు బయలుదేరి భద్రాచలం వెళ్ళినాది. తిరుగు ప్రయాణంలో భద్రాచలం నుండి పరకాలకు వస్తుండగా మార్గమధ్యంలో ఇల్లందు క్రాస్ వద్ద బస్సులో కండక్టర్ శంకర్ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థకు గురై సీటులోనే కుప్పకూలిపోయాడు. వెంటనే బస్సును నిలిపివేసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోకి చేర్పించడం జరిగింది. వైద్యులు పరిశీలించిన అనంతరం అప్పటికే మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు.

కాగా ఈరోజు ములుగు జిల్లా వెంకటాపూర్ మండల్ లక్ష్మీదేవి పేట వారి స్వగృహంలో మృతి చెందిన కండక్టర్ శంకర్ భార్యయగు సౌందర్య యొక్క చిన్ననాటి పదవ తరగతి 1994-95మిత్రులు ఈరోజు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చడం జరిగింది. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులైన లావుడియా రాజు నాయక్, దుంద్ర రాజయ్య, గూడెపు రఘుపతి,మాకోటి శ్రీనివాస్,లింగంపల్లి రాజేశ్వరరావు, జన్ను సుధాకర్ గుడికందుల శంకర్, మూడెత్తుల రవి,ప్రసాద్ రావు,తులాల సునీత, చాడ మాధవి, కందకట్ల శ్రీలత,తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల పేరిట జీతంలో కోతలు అన్యాయం -- టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు బార్మవత్ సూక్య

పాల్వంచ మే 31, మన మహతి న్యూస్

కొత్త విధానాన్ని వెంటనే నిలిపివేయాలి, లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిక

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆరోగ్య పథకానికి సంబంధించి పూర్తి స్థాయి మార్గదర్శకాలు, హెల్త్ కార్డుల జారీ ప్రక్రియ, ఆస్పత్రుల జాబితా, చికిత్సల వివరాలు ప్రకటించకుండానే మే నెల జీతాల్లో కోతలు విధించడం తీవ్రంగా ఖండనీయమని టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు బార్మవత్ సూక్య అన్నారు.

ఉద్యోగుల వివరాల నమోదు ప్రక్రియ ఇంకా పూర్తికాకపోయినా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే 1.5 శాతం కోత విధించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే నమోదు విధానం వంటి కీలక అంశాలపై కూడా స్పష్టత లేకపోవడం గమనార్హమన్నారు.

ఆరోగ్య కార్డుల అమలుపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసిన తర్వాతే అమలు చేయాలని, ఈ పథకంలో చేరేందుకు ఆసక్తి ఉన్నవారికే కోతలు విధించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మే నెల జీతంలో విధించిన కోతను తిరిగి చెల్లించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని పాల్వంచ మండలం టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు బార్మవత్ సూక్య హెచ్చరించారు.

ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలి : ఎస్టీయూటీఎస్, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు ఎండి.లాల్

మన మహతి న్యూస్ కొత్తగూడెం



ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం ప్రవేశపెడుతున్న నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈ హెచ్ ఎస్) అమలుకు సంబంధించిన పూర్తి విధివిధానాలు ఇంకా ఖరారు కాకముందే ఉద్యోగుల మే నెల వేతనాల నుంచి 1.5 శాతం చందా మినహాయింపు చేపట్టడాన్ని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ భద్రాద్రి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రభుత్వం ఏ ఉత్తర్వుల ప్రకారం డిడక్షన్ చేసిందో ప్రశ్నించింది.

ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ సభ్యుల నమోదు ప్రక్రియ ఇంకా 50 శాతం కూడా పూర్తి కాలేదు. ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో తరచూ మార్పులు జరుగుతుండటంతో అనేక మంది ఉద్యోగులు ఇంకా పూర్తి వివరాలు నమోదు చేయలేకపోయారు. కుటుంబ సభ్యుల అర్హత, భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే చందా మినహాయింపు విధానం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు.

ఆరోగ్య పథకం అమలుకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, అన్ని సందేహాలకు సమాధానాలు ఇచ్చి, పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను అధికారికంగా విడుదల చేయాల్సిన అవసరం ఉంది. అలా చేయకుండా ముందస్తుగా వేతనాల్లో కోతలు విధించడం ఉద్యోగుల్లో అసంతృప్తికి దారితీస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకుని ఈహెచ్ఎస్ చందా పేరిట జరుగుతున్న వేతన కోతలను నిలిపివేసి, పూర్తి స్థాయి విధివిధానాలు ప్రకటించిన తర్వాత మాత్రమే అమలు చర్యలు చేపట్టాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి..లాల్ మహమ్మద్, సిహెచ్.వెంకటరమణ డిమాండ్ చేశారు.

ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు : పాక్ దుశ్చర్య



ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్‌వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా సెల్యూలర్ సంకేతాలను పంపిస్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగపడుతోందని అధికారులు వెల్లడించారు.

ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వతశ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి.

ముఖ్యంగా కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి.

పాకిస్థాన్ టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఉగ్రవాదులు వాడే వైఎస్ఎంఎస్‌కు ఉపయోగపడుతుంది. సీడీఎంఏ పలు సిగ్నల్స్‌ను ఏకకాలంలో అనుమతిస్తుంది. దీంతో భద్రతా ఏజెన్సీల ఎలక్ట్రానిక్ మానిటరింగ్ సమస్యాత్మకంగా మారుతుంది. దీంతో ఉగ్రవాదులు వైఎస్ఎంఎస్ టెక్నాలజీని విరివిగా వాడుతున్నారు. దీంతో పాక్ పంపే సిగ్నల్స్‌తో పీవోకేలోని హ్యాండ్లర్లు, చొరబాటుదారులు, వారికి ఆశ్రయం ఇచ్చే వారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఈ అక్రమ విధానాలతో పాకిస్థాన్ ఐరాస అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ రాజ్యాంగంలోని 45 ఆర్టికల్‌ను ఉల్లంఘిస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒప్పందంపై సంతకాలు చేసిన మొత్తం 193 దేశాలు తమ భూభాగం నుంచి అధిక, రోగ్, తప్పుడు, తప్పుదోవ పట్టించే సంకేతాలు పక్కదేశాల్లోకి వెళ్లకుండా సహకరించుకోవాలి.

సాయుధ దళాల వ్యవస్థీకృత సంస్కరణలపైనే దృష్టి: కొత్త సీడీఎస్ రాజా సుబ్రమణి

భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా జనరల్ రాజా సుబ్రమణి నేడు బాధ్యతలు స్వీకరించారు. మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఆయనకు బాధ్యతలను అప్పగించారు. దీంతో మిలటరీ థియేటరైజేషన్ బాధ్యతలను ఇక నుంచి సుబ్రమణి పర్యవేక్షించనున్నారు. వీటి ద్వారానే భారత త్రివిధ దళాల్లో సమన్వయం పెరుగుతుందని అంచనావేస్తున్నారు.

జనరల్ రాజా సుబ్రమణి చైనా, పాకిస్థాన్ అంశాల్లో నిపుణుడిగా సైనిక వర్గాల్లో పేరుంది. ఆయన నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు మిలిటరీ అడ్వైజర్‌గా కూడా పనిచేశారు. వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. తాజా బాధ్యతల్లో ఆయన ఇంటిగ్రేటెడ్ మిలిటరీ కమాండ్స్ ఏర్పాటుతో.. థియేటరైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. మరోవైపు సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పదవీ కాలం శనివారంతో ముగిసింది.

సీడీఎస్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జనరల్ రాజా సుబ్రమణి మీడియాతో మాట్లాడారు. "దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి సైనిక దళాలు పూర్తిగా కట్టుబడి ఉన్నాయన్నారు. దళాలు దేశ సేవ కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తాయని తాను హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

నేవీ చీఫ్‌గా అడ్మిరల్ స్వామినాథన్ బాధ్యతల స్వీకరణ

నేవీ చీఫ్‌గా అడ్మిరల్ స్వామినాథన్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్న డీకే త్రిపాఠీ పదవీకాలం శనివారంతో ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు స్వామినాథన్ వెస్టర్న్ నేవల్ కమాండ్‌కు ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు పూర్తిగా కట్టుబడి ఉంటానని ఈ సందర్భంగా కొత్త నేవీ చీఫ్ వెల్లడించారు.

గాజియాబాద్‌లో సంచలనం.. మిత్రుడిని హత్య చేసిన యువకుడి ఎన్‌కౌంటర్..!

గాజియాబాద్‌లో ఉద్రిక్తతలకు కారణమైన ఓ హత్య కేసులో నిందితుడు శనివారం అర్ధరాత్రి పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. కొన్నాళ్ల క్రితం సూర్యప్రతాప్ చౌహాన్ (17) అనే యువకుడిని అతడి మిత్రుడు అసద్ మరికొందరితో కలిసి కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ దాడి అనంతరం అతడు పరారయ్యాడు. దీంతో పోలీసులు అతడిపై రూ.50,000 రివార్డ్ ప్రకటించారు.

శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిందితుడు అసద్ ఓ మిత్రుడి వద్ద డబ్బులు తీసుకోవడానికి ఖోడా అనే ప్రదేశానికి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. అతడు నగరం నుంచి పారిపోవాలని ప్లాన్ చేసినట్లు గుర్తించారు. నిందితుడి కోసం పోలీసులు ఇందిరాపురంలో వలపన్నారు. బైక్‌పై అసద్ రాగానే లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించారు. అయినా.. అతడు లెక్కచేయకుండా పోలీసులపైకి కాల్పులు జరపడంతో.. వారు ఎదురు కాల్పులు మొదలుపెట్టారు. తూటా అసద్‌కు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలం నుంచి ఓ నాటు తుపాకీ, బైక్ స్వాధీనం చేసుకొన్నారు. అసద్ మిత్రుడు అక్కడి నుంచి తప్పించుకోవడంతో అతడి కోసం గాలింపు చేపట్టారు.

పాతగొడవ నేపథ్యంలో..

అసద్, సూర్య మధ్య కొన్ని నెలల క్రితం ఓ విషయంపై గొడవ జరిగింది. దీనిని మనసులో పెట్టుకొన్న అసద్ బక్రీద్ రోజున సూర్యను ఇంటికి ఆహ్వానించాడు. అతడు వచ్చాక.. కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన గాజియాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.

అవి భారతీయులకు గర్వకారణం..

మొదటిపేజీ తరువాయి

ప్రధాని మోదీ ఈ సంఘటనను కూడా మన్‌కీ బాత్‌లో మాట్లాడారు. గంటలపాటు శ్రమించి డాల్ఫిన్‌ను కాపాడినవారిని అభినందించారు. ఈ సహాయక చర్యల్లో కేంద్రం ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన డాల్ఫిన్ అంబుల్స్ కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. కేరళలోని ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. ఈ క్లబ్ ద్వారా ఇప్పటి వరకు 15వేల మందికి పైగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

ఎండలో జాగ్రత్త..

ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మోదీ పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎండల నుంచి రక్షణ కోసం వాడే పానీయాలు మామిడి పండ్లు, మజ్జిగ, షర్బత్, బేల్‌పనా గురించి ప్రస్తావించారు.

టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే అభిషేక్ బెనర్జీపై దాడికి కారణం: భాజపా

మొదటిపేజీ తరువాయి

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై దాడికి వారి పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే కారణమని భాజపా పేర్కొంది. ఈ మేరకు భాజపా నేత ప్రదీప్ భండారీ పలు ఆరోపణలు చేస్తూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. "అభిషేక్ బెనర్జీపై దాడికి టీఎంసీ అంతర్గత వర్గాలే కారణమా..? అరెస్ట్ అయిన ఆరుగురు నిందితులు మాజీ ఎమ్మెల్యే లవ్లీ మొయిత్రాకు సన్నిహిత సహాయకులే. టీఎంసీ శ్రేణులే అభిషేక్‌కు వ్యతిరేకమయ్యాయా? భాయ్‌పో (బెంగాల్‌లో మేనల్లుడు)పై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో ఊహించుకోండి" అని పేర్కొన్నారు. మరోవైపు పశ్చిమబెంగాల్ మంత్రి అగ్నిమిత్ర పౌల్ కూడా టీఎంసీ ఆరోపణలను తోసిపుచ్చారు. టీఎంసీపై ఉన్న ప్రజాగ్రహానికి ఈ ఘటన అద్దంపడుతోందన్నారు. "ఈ రోజుల్లో మనం నిజమైన ప్రజాగ్రహం చూస్తున్నాం. కొన్నేళ్లుగా మమతా, అభిషేక్, టీఎంసీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడ్డారు. ఇప్పుడు కూడా వారు అటువంటి వాటికి యత్నిస్తే మాత్రం చూస్తూ ఊరుకోము" అని హెచ్చరించారు. హంతకులు ఎవరో ప్రజలు చెబుతున్నారని అగ్నిమిత్ర పౌల్ వ్యాఖ్యానించారు. అభయా ఎలా చనిపోయింది..? మహిళలు గత 15 ఏళ్లుగా హింసను ఎలా అనుభవించారు? కమ్దునీ, పార్క్ స్ట్రీట్‌లలో వందల మంది మా పార్టీ కార్యకర్తలను హత్య చేసి చెట్లకు వేలాడదీసింది చూడాలి. అభివృద్ధి లక్ష్యంతోనే కొత్త ప్రభుత్వం వచ్చింది. రాష్ట్ర ప్రగతి కోసం కలిసి జట్టులా పనిచేద్దాం" అని పేర్కొన్నారు.

ఆన్‌మార్క్ పోర్టల్..

లోపాలు పరిశీలిస్తున్నాం : సీబీఎస్ఈ

మొదటిపేజీ తరువాయి

"ఆన్‌మార్క్ పోర్టల్‌లో వెలుగు చూస్తోన్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ వ్యవస్థలను పటిష్టం చేయడానికి గత కొన్ని రోజులుగా ఐఐటీలు, వివిధ ప్రభుత్వ విభాగాలతో కూడిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు ప్రయత్నిస్తున్నారు. వ్యవస్థను మరింత సురక్షితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన లోపాలను సరిచేశారు. ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయా? అనేది పరిశీలిస్తూ కట్టడి చేసే పనిలో ఉన్నారు. ఈ వ్యవహారంలో అప్రమత్తంగా ఉంటూ లోపాలను ఎత్తిచూపుతున్న పౌరులు, ఎథికల్ హ్యాకర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. వారిలో కొందరిని సంప్రదించాం. మరేదైనా సమాచారం ఉంటే సైబర్ భద్రతా విభాగాన్ని సంప్రదించవచ్చు" అని ఎక్స్ వేదికగా సీబీఎస్ఈ సూచించింది.

ఎన్నిసార్లు దొరికిపోయినా..

కుట్ర రాజకీయాలు మానరా?: నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి

ఆదివారం సెలవు రోజున కొద్దిపాటి సమయం దొరకడంతో తనకు ఇష్టమైన వ్యవసాయ పనుల్లో పాల్గొన్నట్లు మంత్రి నిమ్మల చెప్పారు. సొంత వ్యవసాయ పనుల్లో కార్మికులతో కలిసి పనిచేయడం ఎంతో సంతృప్తిగా ఉంటుందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం గోదావరి డెల్టాకు సాగు నీరు విడుదల చేశామని చెప్పారు. రైతులందరూ ముందస్తుగా వరి నాట్లు వేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో సాగు నీటిని సక్రమంగా వినియోగించుకుంటూ జల సంరక్షణ చేపట్టాలని పిలుపునిచ్చారు.

రైతు డిస్కం పేరుతో సీఎం

రేవంత్‌రెడ్డి కొత్త నాటకం: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రైతు డిస్కం.. అన్నదాతల పాలిట శాపంగా మారనుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ డిస్కం వల్ల తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు వస్తాయని చెప్పారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై మండిపడ్డారు.

"ప్రస్తుతం రైతులకు రోజుకు 13 గంటలకు మించి కరెంట్ ఇవ్వట్లేదు. రైతు డిస్కం ఏర్పాటుతో 7-8 గంటలే ఇచ్చేందుకు కుట్రలు చేస్తున్నారు. గుజరాత్‌లో రైతులకు 7 గంటలే విద్యుత్ ఇస్తున్నారు. బడే భాయి మోదీ విధానాలనే అమలు చేసేందుకు ఛోటా భాయి యత్నిస్తున్నారు. రైతు డిస్కంలో సౌర విద్యుత్ మాత్రమే ఇస్తామని జీవోలో పేర్కొన్నారు. ఆ విద్యుత్‌తో ఎత్తిపోతల ప్రాజెక్టుల మోటార్లు ఎలా నడుస్తాయి?"అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

రైతు డిస్కం ఏర్పాటు వెనుక కుట్ర ఉంది: కవిత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, మీటర్లు బిగించబోమన్న సీఎం.. ఆ విషయాన్ని మీడియా చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటీకరించే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకైనా వెళ్తామని స్పష్టం చేశారు. కేంద్రం తెచ్చిన కొత్త సోలార్ జీవో.. బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తోందని ధ్వజమెత్తారు.

ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటన దారుణమన్నారు. సీఎం, ఖమ్మం జిల్లా మంత్రులు బాధ్యత వహించి ఆ చిన్నారి పేరిట రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. దసరా నాటికి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును ప్రతిపాదించకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలు దేశాభివృద్ధికి భారం కాదు -- సామాజిక న్యాయానికి పునాది వ్యాసకర్త: బస్కీ నాయక్

ఇటీవల కొంతమంది పన్ను చెల్లింపుదారులు, కొందరు యూట్యూబ్ విశ్లేషకులు మరియు సామాజిక మాధ్యమాల్లో చర్చించే వ్యక్తులు ఒక వాదనను ముందుకు తెస్తున్నారు. తాము చెల్లిస్తున్న పన్నుల డబ్బును ప్రభుత్వాలు రోడ్లు, వంతెనలు, పరిశ్రమలు, మౌలిక వసతుల నిర్మాణానికి వినియోగించకుండా ఉచితాలు, సంక్షేమ పథకాల పేరుతో పేదలకు పంచిపెడుతున్నాయని, అలాంటి పథకాలను పూర్తిగా రద్దు చేయాలని వారు కోరుతున్నారు. కొందరు ఈ విషయంలో కోర్టులను కూడా ఆశ్రయిస్తామని చెబుతున్నారు.

ఈ వాదనను పరిశీలిస్తే ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది. దేశ సంపదను సృష్టించేది ఎవరు? కేవలం పన్నులు చెల్లించే ఉద్యోగులు, వ్యాపారవేత్తలేనా? లేక రైతులు, రైతు కూలీలు, పశుపోషకులు, మత్స్యకారులు, చేతివృత్తిదారులు వంటి గ్రామీణ ఉత్పత్తి రంగాల ప్రజలూ దేశ సంపద సృష్టిలో భాగస్వాములేనా?

వాస్తవానికి దేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారం వ్యవసాయం. రైతు పొలంలో పండించే ధాన్యం లేకుంటే పరిశ్రమలు, వ్యాపారాలు, ఉద్యోగాలు ఏవీ నిలవవు. రైతు, రైతు కూలీ, వ్యవసాయ అనుబంధ రంగాల కష్టం వల్లే దేశ ప్రజలకు ఆహారం అందుతోంది. ఆహార భద్రత లేకుండా ఏ దేశమూ అభివృద్ధి చెందలేదు.

చరిత్రను పరిశీలిస్తే రైతాంగం ఎన్నో దశాబ్దాలుగా దోపిడీకి గురైంది. ఒకప్పుడు జమీందారులు, జాగీర్దారులు, భూస్వాములు రైతుల శ్రమను దోచుకున్నారు. తరువాత కాలంలో మధ్యవర్తులు, దళారీ వ్యవస్థ రైతు ఉత్పత్తులకు సరైన ధర రాకుండా చేసి వారి సంపదను తమ చేతుల్లోకి మళ్లించుకుంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలై, ఆర్థిక ఇబ్బందులతో వేలాది మంది ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు దేశ చరిత్రలో ఉన్నాయి.

1990ల వరకు గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలు సరైన ఇళ్లు కూడా లేక వరిగడ్డి, తాటాకులు, జొన్న చొప్పలతో కప్పులు వేసుకుని జీవించేవి. కష్టపడి ఆహారాన్ని ఉత్పత్తి చేసిన వారు కనీస జీవన సౌకర్యాలకు కూడా నోచుకోలేదు. కానీ వారి శ్రమతో ఏర్పడిన ముడి సరుకులు, వ్యవసాయ ఉత్పత్తులు ఆధారంగా ఇతర రంగాలు అభివృద్ధి చెందాయి. పరిశ్రమలు, వ్యాపారాలు, మార్కెట్లు, సేవా రంగాలు విస్తరించాయి.

ఇప్పుడు కొందరు "మేము పన్నులు కడుతున్నాం, అందుకే సంక్షేమ పథకాలు వద్ద" అని వాదించడం సామాజిక వాస్తవాలను విస్మరించడం అవుతుంది. రైతు లేకపోతే ఆహారం లేదు. ఆహారం లేకపోతే ఉత్పత్తి లేదు. ఉత్పత్తి లేకపోతే వ్యాపారం లేదు. వ్యాపారం లేకపోతే లాభాలు లేవు. లాభాలు లేకపోతే పన్నులు కూడా ఉండవు. కాబట్టి పన్ను చెల్లింపుదారులు మరియు ఉత్పత్తి రంగాల ప్రజలు పరస్పర ఆధారిత వ్యవస్థలో భాగాలు.

సంక్షేమ పథకాలు దానం కాదు. అవి రాజ్యాంగబద్ధమైన సామాజిక న్యాయ చర్యలు. సమాజంలో శతాబ్దాలుగా వెనుకబడిన వర్గాలకు కనీస జీవన భద్రత, విద్య, ఆరోగ్యం, ఆహారం, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. ఇది కేవలం రాజకీయ ప్రయోజనం కాదు; సంక్షేమ రాజ్య లక్షణం.

అభివృద్ధి మరియు సంక్షేమం పరస్పర విరుద్ధాలు కావు. రోడ్లు, వంతెనలు, పరిశ్రమలు ఎంత అవసరమో, ఆకలితో ఉన్న కుటుంబానికి ఆహారం, పేద విద్యార్థికి విద్య, రైతుకు మద్దతు, వృద్ధుడికి పెన్షన్ కూడా అంతే అవసరం. సమతుల్య అభివృద్ధి అంటే మౌలిక వసతులతో పాటు సామాజిక భద్రతను కూడా కల్పించడం.

అందువల్ల పేదలు, రైతులు, కూలీలు, బడుగు బలహీన వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలను విమర్శించే ముందు వారి చారిత్రక పరిస్థితులు, వారు దేశ సంపద సృష్టిలో పోషిస్తున్న పాత్ర, వారి శ్రమ విలువను అర్థం చేసుకోవాలి. సమాజంలో బలహీన వర్గాలను మరింత బలపరచడమే నిజమైన అభివృద్ధికి పునాది.

పన్నులు చెల్లించే వర్గాలు మరియు ఉత్పత్తి రంగాల ప్రజలు పరస్పరం విభేదించకుండా, ఒకరినొకరు గౌరవించుకుంటూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి. అదే రాజ్యాంగ స్ఫూర్తి, అదే సమానత్వ భారతదేశం యొక్క లక్ష్యం.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం:

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం 31.5.2026 నాడు ఆదిలాబాద్ పట్టణంలోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే శ్రీ అనిల్ జాదవ్ గారితో పాటు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ అధ్యక్షులు శ్రీ టి సి రాథోడ్, జాతీయ గౌరవాధ్యక్షులు శ్రీ అమర్ సింగ్ తిలావత్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మోహన్ సింగ్, రూపవత్ కిషన్ నాయక్ ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ ఉపాధ్యక్షులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బంజారా జాతి అభ్యున్నతి, కుల ధ్రువీకరణ పత్రాల సమస్యలు, విద్యా--ఉద్యోగ అవకాశాలు, జాతి హక్కుల పరిరక్షణ, సంఘ బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ యాదవ్ మాట్లాడుతూ, సమాజ సమస్యల పరిష్కారానికి సంఘాలు బలంగా ఉండటం అత్యవసరమని, సంఘటిత శక్తితో పోరాడినప్పుడే ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు సామాజిక సంస్థలు కూడా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బంజారా సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. నిజమైన

గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బంజారా జాతిని ఒకే జాతిగా గుర్తించి, ఒకే విధమైన రిజర్వేషన్ అమలు చేయాలనే లక్ష్యంతో ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

జాతీయ అధ్యక్షులు డాక్టర్ టి.సి. రాథోడ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారాలకు పాల్పడకుండా జాతి ఐక్యత కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర అధ్యక్షులు మోహన్ సింగ్. ఆర్ మాట్లాడుతూ సంఘ ఐక్యతే సంస్థ బలమని, నూతన జిల్లా కమిటీ సభ్యులు సమాజ సేవలో ముందుండి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని మరియు ప్రతి మండలంలోని తండాలను సందర్శించి మండల కార్యవర్గాన్ని బలోపేతం చేయాలని సూచించారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చవాన్ మాట్లాడుతూ, బంజారా సమాజంలోని అన్ని సంస్థలు సోదరభావంతో కలిసి పనిచేయాలని, గిరిజన హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా పోరాటం చేయాలని కోరారు.

సభాధ్యక్షులు తారాచంద్ నాయక్ మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిషన్ నాయక్ రూపావత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్కీ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీముడు నాయక్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బాపురావు, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ తుకారం, రాథోడ్ భీమ్రావు, బానోతు జగన్, అడ్వకేట్ రాథోడ్ నారాయణ, వైస్ ప్రెసిడెంట్ బానోతు గజానంద్, సర్పంచ్‌లు, వివిధ జిల్లాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు బంజారా సమాజ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశం విజయవంతంగా ముగియగా, బంజారా జాతి హక్కుల సాధన, సంఘ బలోపేతం మరియు భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక తీర్మానాలు ఆమోదించబడ్డాయి.

సత్యనారాయణ కాలనీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

- ఘనంగా జరిగిన అసోసియేషన్ ప్రమాణ స్వీకార మహోత్సవం
- ముఖ్య అతిథులుగా హాజరైన ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కౌకుట్ల జీవన్ రెడ్డి
- కాలనీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తాం: నూతన అధ్యక్షుడు రఘు ప్రసాద్

మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘటకేసర్ నాగారం, మే 31

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ యునైటెడ్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (రి.నెం. 378/2026) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం స్థానిక రోడ్ నెం.5, సాయిబాబా గుడి పక్కన గల ఖాళీ స్థలంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖ రిటైర్డ్

డిప్యూటీ కలెక్టర్ యం.వి. రమణ ముఖ్య విచ్చేసి, నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు.

అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా జి. రఘు ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె. శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా ఎం. భద్రు నాయక్ ప్రమాణ స్వీకారం చేయగా, వారితో పాటు మరో 29 మంది కార్యవర్గ సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు.

కాలనీల అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముప్పు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కాలనీల సర్వతోముఖాభివృద్ధికి నూతన కమిటీతో పాటు కాలనీ వాసులందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం నూతన అధ్యక్షుడు రఘు ప్రసాద్ మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ, భద్రతా ప్రమాణాల పెంపునకు తాము ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, అందరి సహకారంతో సత్యనారాయణ కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. హాజరైన ప్రముఖులు

ఈ వేడుకలో మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, పంగ హరి బాబు, మాజీ వార్డు సభ్యులు చిన్నం రాజు సాయినాథ్ గౌడ్, చిన్నం రాజు సతీష్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణపురం కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, టీజేఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పంగ సంతోష్, కాలనీ సలహాదారులు కె. వెంకటరత్నం, బి. అంజిరెడ్డి, శంకరప్ప, టీడీపీ నాయకులు ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

పాల్వంచ 38వ డివిజన్ పరిధిలో విస్తృతంగా పర్యటించిన కార్పొరేటర్ బత్తుల మధుచంద్

మన మహతి న్యూస్ ప్రతినిధి పాల్వంచ:

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 38వ డివిజన్ టీచర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ బత్తుల మధుచంద్ విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యటన సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్యం,డ్రైనేజీ,వీధి దీపాలు,రహదారులు తదితర సమస్యలను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,ప్రజా సమస్యల పరిష్కారం మరియు డివిజన్ అభివృద్ధే తన లక్ష్యమని ఈ సందర్భంగా బత్తుల మధుచంద్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో తుంగపాటి లక్ష్మీనారాయణ,అల్లి సాయి కిరణ్,ధనుష్ యాదవ్,కర్ణాటి లీల,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్న కృపానిధిస్ కృష్ణవేణి హై స్కూల్.

సంగారెడ్డి, మే 31,మన మహతి న్యూస్ :

నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సంగారెడ్డి పట్టణంలోని కృపానిధిస్ కృష్ణవేణి హై స్కూల్ విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ప్రీ–ప్రైమరీ నుంచి హై స్కూల్ వరకు ఆధునిక విద్యా విధానాలతో బోధన అందిస్తూ విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు తీర్చిదిద్దుతోంది.

స్కూల్‌లో డిజిటల్ తరగతి గదులు, సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, విశాలమైన ఆట స్థలాలు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బృందం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన అందిస్తూ, విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ ప్రదర్శనలు, వ్యక్తిత్వ వికాస శిక్షణలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందేలా చర్యలు చేపడుతున్నారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఈ విద్యాసంస్థ ప్రత్యేకతగా నిలుస్తోంది.

భద్రత, పరిశుభ్రత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ తల్లిదండ్రుల విశ్వాసాన్ని సంపాదించుకున్న కృపానిధిస్ కృష్ణవేణి హై స్కూల్, సంగారెడ్డి జిల్లాలో నాణ్యమైన విద్యకు మార్గదర్శకంగా నిలుస్తోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయడమే తమ లక్ష్యమని స్కూల్ యాజమాన్యం పేర్కొంది.

రామ్ నగర్, 22 వ వార్డులో గ్రామైక్య సంఘ మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి.

సంగారెడ్డి, మే 31,మన మహతి న్యూస్ :

సంగారెడ్డి పట్టణం లోని 22 వ వార్డ్ రామ్ నగర్ లో గ్రామైక్య మహిళా సంఘ సభ్యులకు నిర్మలా జగ్గారెడ్డి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. రామ్ నగర్, రామ్ మంధిర్ లోని ఆమె స్వగృహం లో , స్థానిక కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యం లో ఈ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతిగా ఉందని, ఏ ప్రభుత్వ కార్యక్రమం మొదలుపెట్టినా మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుందని, గత ప్రభుత్వం లో పంపిణీ చేసిన చీరలను పొలాల వద్ద బెదురు కోసం వాడిన విషయాన్ని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ రెడ్డి, వార్డు పెద్దలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

వాకిటి శ్రీహరి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం..

మన మహతి. న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.

మక్తల్ మండలం లింగంపల్లి గ్రామంలో 1వ తేదీ సోమవారం రోజు వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి, లింగంపల్లి సర్పంచ్, కాంగ్రెస్ నాయకుల సహకారంతో పాలమూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి సౌజన్యంతో లింగంపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి వ్యవస్థాపకులు అల్కూరి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్తల్ మండలంలోని లింగంపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు... ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి సమస్యలున్న వారికి వైద్యులు సూచించిన మేరకు ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడంతోపాటు ఉచిత భోజన, రవాణా ఖర్చులు, ఉచిత మందులను సైతం అందజేయడం జరుగుతుందని అన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోధుమకుంట సాహితీ హరిహర కాలనీలో కాంగ్రెస్ నేతల పర్యటన

- కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్న ముప్పు శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి
- డ్రైనేజీ, రోడ్ల దుస్థితిని వివరించిన కాలనీవాసులు
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకుల హామీ

మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ నాగారం, మే 31

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోధుమకుంట సాహితీ హరిహర కల్చరల్ అసోసియేషన్ కాలనీలో ఆదివారం నాగారం కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృతంగా పర్యటించారు. కాలనీ అసోసియేషన్ ఆహ్వానం మేరకు స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఈ సందర్శన చేపట్టాయి. ఈ సందర్భంగా కాలనీవాసులు, అసోసియేషన్ ప్రతినిధులు



కాంగ్రెస్ నాయకులను కలిసి కాలనీలో ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అంతర్గత రోడ్ల దుస్థితి, పారిశుధ్య లోపం, వర్షాకాలంలో ఎదురయ్యే డ్రైనేజీ ఇబ్బందులను నాయకులకు వివరించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

కాలనీవాసుల ప్రధాన వినతులు: రోడ్ల పునర్నిర్మాణం: గుంతలమయంగా మారిన అంతర్గత రహదారులను బాగు చేయాలి.

పారిశుధ్య నిర్వహణ: డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, నిరంతర పారిశుధ్యాన్ని పర్యవేక్షించాలి.

మౌలిక వసతులు: వీధి దీపాలు, తాగునీటి సరఫరాను మరింత క్రమబద్ధీకరించాలి.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ముప్పు శ్రీనివాస్ రెడ్డి కాలనీవాసుల సమస్యలపై నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యువ నాయకులు కౌకుంట్ల జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారంలో తాము ఎప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు.

హాజరైన ప్రముఖులు

ఈ పర్యటనలో మాజీ ఎంపీటీసీ కిరణ్ జ్యోతి ప్రవీణ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగేటి పర్వత రెడ్డి , కాలనీ ప్రెసిడెంట్ జి. రమేష్ , కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు మరియు కాలనీ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల విధివిధానాలు ఖరారు కాకముందే జీతాల్లో కోతలు అన్యాయం: టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం వెంకటేశ్వర్లు

మన మహతి న్యూస్ పాల్వంచ

పాల్వంచ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం మండల అధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, హెల్త్ కార్డుల పథకానికి సంబంధించిన విధివిధానాలు, ఆస్పత్రులతో ఒప్పందాలు, ప్యాకేజీ రేట్లు, డిజిటల్ హెల్త్ కార్డుల జారీ వంటి అంశాలు ఇంకా ఖరారు కాకముందే ఉద్యోగుల మే నెల జీతాల నుంచి 1.5 శాతం ఈహెచ్ఎస్ చందా పేరుతో కోత విధించడం తీవ్రంగా ఖండనీయమని అన్నారు.

ఆరోగ్య శాఖ నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉండగా, వాటి లేకుండానే ఆర్థిక శాఖ వేతనాల్లో కోత విధించడం ఉద్యోగులు, పెన్షనర్లలో అనేక సందేహాలకు

దారితీస్తోందన్నారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు ప్రక్రియ కూడా పూర్తికాకముందే కోతలు విధించడం సరికాదని పేర్కొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని, పథకాన్ని పారదర్శకంగా అమలు చేసి అన్ని సందేహాలను నివృత్తి చేసిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి వెంటనే జోక్యం చేసుకుని జీతాల్లో 1.5 శాతం కోతను నిలిపివేయాలని టీఎస్ యుటీఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ తరఫున కోరారు.

ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ పాషా, మండల ప్రధాన కార్యదర్శి జి. హరి సింగ్, ఉపాధ్యక్షులు ఏ. విజయభాస్కర్, సత్యశ్రీ, అంబికా జాదవ్, ఎం. రాజులు, టి. వెంకన్న, వి.టి.ఆర్. మోహన్‌రావు, బి. మంగీలాల్, సమ్మయ్య, టి. బాలు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా 29 సంవత్సరాల తర్వాత శ్రీ విజయ భారతి జూనియర్ కాలేజ్, హంటర్ రోడ్, హన్మకొండ డీఐ.జ (1995--97) బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హనుమకొండ జిల్లా మే 31 న్యూస్

దాదాపు 29 సంవత్సరాల తర్వాత, స్నేహితులమంతా ఒకే వేదికపై కలుసుకోని అంబరాన్ని అంటే సంబరాలు చేసుకున్నారు.

ముందుగా కీర్తిశేషులు వంశీ కృష్ణ మరియు ప్రవీణ్ బాబులకు అశ్రునయనాలతో వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే శక్తిని ఇవ్వాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు

మీరు మా మధ్య లేకపోయినా, మీతో ఉన్న ఎన్నో మరచిపోలేని మధుర జ్ఞాపకాలు ఎప్పటికీ మా గుండెల్లో పదిలంగా మాతోనే ఉంటాయి అని స్మరించుకున్నారు

కాలం వీరందరినీ వేర్వేరు దారుల్లో నడిపించినా, వారి హృదయాలను కలిపిన ఆ కాలేజ్ జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మరచిపోలేదు . తరగతి గదులు, ల్యాబ్‌లు,

పరీక్షల ఒత్తిడి, స్నేహితుల అల్లరులు, ఉపాధ్యాయుల మార్గదర్శనం -- ఇవన్నీ ఈరోజు మళ్లీ మన కళ్లముందు కదలాడుతున్నాయి అని గుర్తుచేసుకొన్నారు.

1995లో విద్యార్థులుగా ప్రారంభమైన వీరి ప్రయాణం, 1997లో కాలేజ్‌ను విడిచిన తర్వాత అనేక రంగాల్లో విజయాలను అందుకున్నారు వైద్యులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి ఒక్కరూ తమ తమ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు.

కానీ ఈరోజు వారు ఏ హోదాలో ఉన్న తోటివారికి సహాయ సహకారాలను అందిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తూ , విరాళాలు సేకరించి చేయూత అందిస్తున్నారు.

వారి జీవితాలకు పునాది వేసిన గురువులకు ఈ సందర్భంగా హృదయపూర్వక నమస్సులు తెలియజేశారు. వారు అందించిన విద్య, విలువలు, క్రమశిక్షణ, ప్రోత్సాహం వల్లనే మనం ఈ స్థాయికి చేరుకున్నాం. వారి సేవలను స్మరించుకుంటూ వారికి మన కృతజ్ఞతలను తెలియజేద్దాం అని స్మరించుకున్నారు.

జై శ్రీ విజయ భారతి!

జై స్నేహబంధం!

ఎంజేపివిసి ఆధ్వర్యంలో విజయవంతం అయిన వేసవి కాలం శిక్షణ శిబిరం

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.

మే నెలలో మంగళవారం నుండి ఆదివారం వరకు ఎంజేపివిసి ఆధ్వర్యంలో మక్తల్ గీతం హై స్కూల్ లో మక్తల్ అసెంబ్లీ పరిధిలో కృష్ణ మగానుర్ మక్తల్ ఉట్కూర్ నర్వ మండలంలలో వేసవి కాలం శిక్షణ శిబిరం విజవంతం అయింది అని ఎంజేపివిసివ్యవస్థపాక అధ్యక్షులు కెవి నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు ఈ శిక్షణ కార్యక్రమంలో

26/5/2026మంగళవారం కవితలు ఎలా రాయాలి

27/5/2026బుధవారం స్టేజ్ పై ఎలా మాట్లాడాలని

28/5/2026గురువారం స్వచ్ఛమైన రైటింగ్

29/5/2026శుక్రవారం సోసియల్ మీడియా పై అవగాహనా

30/5/2026శనివారం మోటివేషన్ శిక్షణ పాటలు ఎలా రాయాలి పాటలు ఎలా పాడాలి

31/5/2026ఆదివారం నిలువు రాళ్ళను సందర్శించి వాటి

యొక్క చరిత్ర తెలుసుకోవడం వంటి అంశాల పై శిక్షణ నిర్వహించడం జరిగింది

చివరి రోజు అంటే ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ముడుమాల్ గ్రామంలో ఉండే ప్రపంచాన్ని అబ్బురా పరిచే నిలువు రాళ్లను సందర్శించి అనంతరం అక్కడే ప్రాతిభను కనబరిచిన విద్యార్థులకు ఎంజేపీవీసి ప్రశంశ పత్రాలు అందివడం జరిగింది అనంతరం వచ్చిన ముఖ్య నాయకులకు శాలువతో సన్మానం చేయడం జరిగింది ప్రపంచంలో ఎక్కడ లేని గొప్ప అదిమానావా సంపద ఉండడం చాలా అద్భుతం ఇలాంటి ప్రదేశం చాలా పురాతనం అయినా ప్రదేశం కావున ప్రతి ఒక్కరు కూడా ఈ ప్రదేశం సందర్శించాలి అని చాలా మంది నాయకులు మాట్లాడారు అలాగే ప్రభుత్వం దీని పై ద్రుష్టి పెట్టి అభివృద్ధి పతంలో నడపాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో టీచర్స్ రేణుక అమృత పద్మ విదర్థులు వినయ్ కుమార్ అభిరామ్ ఆశ మహేశ్వరీ శ్రీవల్లి పల్లవి మాంజుల లక్ష్మి కురుమూర్తి ఎంజేపీవీసి నాయకులు కెవి నరసింహ గణేష్ ఆంజనేయులు మరియు ముడుమల గ్రామ అంబేద్కర్ సంఘ నాయకులు రాము కొత్తపల్లి అంజప్ప బుదేప్ప కృష్ణ తిరుమలేష్ తదితరులు పాల్గొని ఎంజేపీవీసి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం విజవంతం చేశారు

కెవి నరసింహ

ఎంజేపీవీసి వ్యవస్థపాక అధ్యక్షులు

రైటర్ సింగర్ ఆర్ టీ ఐ ఆక్టివిస్ట్

ప్రపంచాన్ని అబ్బురా పరిచే నిలువు రాళ్ళ చరిత్ర పుస్తక రచయిత 9393203075

కృష్ణ మండలంలో మూడు ప్రీ ప్రైమరీ స్కూళ్లకు అనుమతి

మండల విద్యాధికారి నిజాముద్దీన్"

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణ మండలం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పేంచే లక్ష్యంతో తీసుకువచ్చిన ప్రీ ప్రైమరీ పాఠశాలలను కృష్ణ మండలంలో ముడుమాల, హిందూపూర్,కున్సీ గ్రామాలకు మంజూరైనట్లు పేర్కొన్నారు.జూన్ 12 నుండి 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అడ్మిషన్లు కల్పించి

ఆట పాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశానుసారం తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రీ ప్రైమరీ తరగతులను సద్వినియోగం చేసుకోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చుటకు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని ఒక ప్రకటనలో తెలియజేశారు...

ఎస్వీ బేకరీ ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఇన్ సంగారెడ్డి.

సంగారెడ్డి, మే 31, మన మహతి న్యూస్ :

సంగారెడ్డి బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్వీ బేకరీని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బేకరీ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానిక యువత ఉపాధి అవకాశాలను పెంపొందించే ఇటువంటి వ్యాపార సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ సంస్థ మంచి పేరు సంపాదించాలని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, చీల మలన్న, రఘు, సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొని బేకరీ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన రాంపూర్ నాగన్న.సోదరులు

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.

మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం రాంపూర్ గ్రామంలో బక్రీద్ పండుగ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టౌర్నమెంట్ ముగింపు

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై. గెలిచిన విజేతలకు, నాగన్న.సోదరులు, శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వర్ధన్ రెడ్డి చేతుల మీదుగా.

విన్నర్ టీం బాలకృష్ణపూర్ 15000-/రన్నర్ టీం దేవరకద్ర 8000-/అందించడం జరిగింది.

ఈకార్యక్రమంలో రాంపూర్ గ్రామ ఉపసర్పంచ్ రఫీక్,గ్రామ కాంగ్రెస్ నాయకులు కొన్నింటి కుర్మన్న, చోట బడేసాబ్, ఉమర్ ,స్థానిక ప్రజాప్రతినిధులు, మైనార్టీ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విధి విధానాలు లేకుండా ఉద్యోగుల జీతం నుండి కోతలు కోయడం దారుణం

తపస్ జిల్లా శాఖ తీవ్ర ఖండన

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.

ప్రభుత్వం ఉద్యోగుల జీతాల నుండి జూన్ 2 కు ఇస్తామని చెప్పిన ఆరోగ్య కార్డుల కోసం ఎటువంటి విధి విధానాలు లేకుండా మే నెల జీతం 1.5 శాతం ప్రీమియం ఆరోగ్య కార్డు పేరుతో కోతలు కోయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నారాయణ పేట్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తీవ్రంగా ఖండించారు.

డి డి ఓ లకు తెలియకుండా, ఉద్యోగులతో ఒప్పందం లేకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత దారుణం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.ఈ విషయం లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తక్షణ కార్యాచరణకు సిద్ధం అవుతుందని తెలియజేస్తున్నాము.

టాక్ యావరేజ్.. కలెక్షన్స్ సూపర్ హిట్.. మరి 'దృశ్యం 4' ఉంటుందా?

మోహన్‌లాల్ కీలక పాత్రలో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో వచ్చిన తాజా క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్ 'దృశ్యం3' . గతం చిత్రాలకు కొనసాగింపుగా ఈ మూవీని తీర్చిదిద్దారు. మలయాళంతో పాటు, తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. మరీ ముఖ్యంగా ప్రథమార్ధమంతా సాగదీత వ్యవహారమంటూ సమీక్షకులు, విమర్శకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ అవేవీ 'దృశ్యం3' వసూళ్లను ఆపలేకపోయాయి. ద్వితీయార్ధం, ముఖ్యంగా చివరి గంట కథ, కథనాలను ఆసక్తికరంగా థ్రిల్ పంచేలా నడపడంలో జీతూ మార్క్ కనపడింది. అదే ఇప్పుడు ఈ మూవీని నిలబెట్టింది. వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ.200 కోట్లకు పైగా రాబట్టి, అత్యధిక వసూళ్లు మలయాళ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

ఇండియాలో రూ.100 కోట్లు

మే 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ తాజాగా భారత్‌లో రూ.105 కోట్లు (గ్రాస్) రాబట్టింది. శనివారం దేశవ్యాప్తంగా 2,570 షోలు పడగా, రూ.5.05 కోట్లు వచ్చాయి. ఓవర్సీస్‌లోనూ ఈ మూవీని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా రూ.113.75 కోట్లు వసూలు చేయగా, మొత్తం రూ.219 కోట్లకు పైగా రాబట్టింది. తాజా వసూళ్లతో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన మలయాళ చిత్రాల్లో ఆరోస్థానంలో నిలిచింది. రూ.303 కోట్లతో ఇప్పటికీ 'కొత్తలోక: చాప్టర్1' టాప్‌లో ఉండటం గమనార్హం.

దృశ్యం4 ఉంటుందా?

'దృశ్యం3' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైతే 'దృశ్యం 4, 5' కూడా రావొచ్చని మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ పలు వేదికలపై అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్నట్లుగా ప్రస్తుతం 'దృశ్యం3' బాక్సాఫీస్ వద్ద జోష్ చూపిస్తోంది. ఈ క్రమంలో నాలుగో భాగం వచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అయితే, ఇప్పటికిప్పుడే అది సాధ్యమయ్యే పని కాదు. ప్రస్తుతం విజయాన్ని ఆస్వాదిస్తున్న చిత్ర బృందం నుంచి కూడా ఎలాంటి ప్రకటనా రాలేదు. అలాగని, చెప్పిన కథే మళ్లీ చెప్పి పిప్పి పిప్పి చేసి, చివరో ఓ ట్విస్ట్‌తో ముగిస్తానంటే కుదరదు. చూద్దాం..! దేనికైనా కాలమే సమాధానం చెబుతుంది.

'నో' చెప్పడం కూడా నేర్చుకుంటేనే...!

మాతృత్వ దశ తన జీవితాన్ని మార్చివేసింది కానీ తాను పనిచేసే విధానాన్ని మాత్రం మార్చలేదని అంటోంది బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్. 'ఆర్టికల్ 370', 'హక్' లాంటి శక్తిమంతమైన కథలతో ప్రయాణిస్తున్న నాయికీమె. ఇటీవలే 'ధురంధర్ 2'లో అతిథి పాత్రలో మెరిసిన ఈమె.. ప్రస్తుతం 'నయా నవేలి' అనే సినిమాతో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న యామి.. కొన్ని ఆసక్తికర విషయాలతో అభిమానుల ముందుకొచ్చింది.

"ఇటీవలే నేను బాబుకి జన్మనిచ్చిన విషయం అందరికీ తెలిసిందే. కానీ తల్లి కావడం నా వృత్తిపరమైన ఎంపికలను ఏ మాత్రం ప్రభావితం చేయలేదు. వ్యక్తిగత, వృత్తిపర జీవితాల మధ్య సమతుల్యతను పాటించాలనే విషయం గురించి నాకు తెలుసు. ఒక్కసారి మీరు తల్లి అయ్యాక.. ఆ గుర్తింపు అన్నివేళలా మీతోనే ఉంటుంది. సెట్‌లో నేను ఒక నటిగా పనిచేస్తున్నప్పటికీ.. ప్రతి క్షణం నేను ఒక తల్లినే. మాతృత్వం అనేది గొప్ప భావోద్వేగం. ఇలాంటి అద్భుతమైన అనుభూతిని పొందినందుకు నేను చాలా అదృష్టవంతురాలిని".

సందేహంగా ఒప్పుకున్నా.. సాగిపోవాలి

"సినీరంగంలో నా దశాబ్దాల కెరీర్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ఎదుగుదలకు దృఢ సంకల్పమే ముఖ్య కారణం. ఒకానొక దశలో నేను విజయాల వెంట పడటం మానేసి.. నా మనసుకు నిజంగా హత్తుకునే కథలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించాను. దీనికి సహనం ఎంతో అవసరం. మీరు అవకాశాలను వెతుక్కునే సమయంలో మీకు సరిపోయే ఆ ఒక్క సినిమాను, పాత్రను కూడా గుర్తించడం చాలా ముఖ్యం. ఈ క్రమంలో కొన్నిసార్లు 'నో' చెప్పడం కూడా నేర్చుకోవాలి. కొందరు సందేహంగానే కొన్ని ప్రాజెక్టుల్ని ఒప్పుకొని ఉండొచ్చు. అయినా మీరు ముందుకు సాగుతూనే ఉండాలి. అందరికీ కనిపించేలా పనిచేస్తూనే ఉండాలి".

అతిగా ఆలోచించను

"జీవితంలో ఒక దశకు చేరుకున్న తర్వాత మనలో భయం పోతుంది. నా విషయంలో అది 'బాలా', 'ఉరి' సినిమాల సమయంలో జరిగింది. పాత్రలు నన్ను ఆకట్టుకుంటేనే వాటిని అంగీకరించాలని అప్పుడే గట్టిగా నిర్ణయించుకున్నా. నేను కొన్ని విషయాల గురించి అతిగా ఆలోచించను. నచ్చకపోతే.. అది నాకు వెంటనే తెలిసిపోతుంది. ఏదేమైనా నా మనసు చెప్పేదే నమ్ముతా".

మే మెరుపుల్లేవ్!

వేసవి సినీ మారథాన్‌కి జూన్ క్లైమాక్స్ అయితే.. ప్రీక్లైమాక్స్ మే. జూన్ రెండో వారానికే సెలవుల సీజన్ ముగుస్తుంది కనుక.. ఈ సీజన్‌లో ఆఖరిగా వచ్చే బడా చిత్రాలన్నీ మేలోనే మెరుపులు మెరిపించేందుకు బాక్సాఫీస్ ముందుకు వరుస కడుతుంటాయి. అయితే కొవిడ్ తర్వాత నుంచి ఈ పరిస్థితులన్నీ పూర్తిగా తారుమారయ్యాయి. గత నాలుగైదేళ్లలో తెలుగు చిత్రసీమ ఒక్క వేసవి సీజన్‌నీ పూర్తిగా సొమ్ము చేసుకోలేకపోయింది. ఇక ఈసారైతే మరింత గడ్డు పరిస్థితి. సమ్మర్‌లో ఇంతవరకు సరైన సినిమా పడలేదని ఇటు ప్రేక్షక లోకం.. అటు సినీ పరిశ్రమ ముక్త కంఠంతో చెబుతోంది. మార్చి, ఏప్రిల్‌లో ఒకటి రెండు చెప్పుకోదగ్గ చిత్రాలైనా థియేటర్లలో సందడి చేసినా.. కీలకమైన మేలో ఒక్కటంటే ఒక్కటీ చెప్పుకోదగ్గ సినిమా కనిపించకపోవడం సినీ ప్రేమికుల్ని, పరిశ్రమ వర్గాల్ని కలవరపాటుకు గురి చేస్తోంది. ఈ మేలో నేరుగా తెలుగు

చిత్రసీమ నుంచి దాదాపు ఇరవై చిత్రాల వరకు బయటకొచ్చినా.. అందులో ఏ ఒక్కటీ ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించలేకపోయింది. ఆ వచ్చిన వాటిలో ఏ ఒక్క దాంట్లోనూ స్టార్ కళ కనిపించకపోవడం.. ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించే కంటెంట్ లేకపోవడం పెద్ద లోటు. మే తొలివారం తరుణ్ భాస్కర్ 'గాయపడ్డ సింహం', సత్య 'జెట్లీ' చిత్రాలు బాక్సాఫీస్ బరిలో తలపడ్డాయి. వీటిలో తరుణ్ సినిమాకి పాస్ మార్కులు పడ్డప్పటికీ.. థియేటర్లకు కళ తెచ్చే స్థాయిలో వసూళ్లు రాలేదు. ఆ మరుసటి వారం 'గోదారి గట్టుపైన', 'రేజర్', 'సతీ లీలావతి'.. ఇలా నాలుగైదు చిత్రాలు అదృష్టం పరీక్షించుకున్నాయి. కానీ, వీటిలో ఏ ఒక్కటీ సినీప్రియుల దృష్టిని ఆకర్షించలేకపోయాయి. ఇక మే చివరి మూడు వారాల్లో తెలుగు నుంచి 'దూరదర్శిని', 'హరుడు', 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోం', 'పురుషః', 'ఫస్ట్ టైమ్', 'రమణీ కల్యాణం', 'అగ్లీ స్టోరీ', 'త్రికాల', 'మరీచిక', 'సందిగ్ధం' లాంటి డజను వరకు చిన్న చిత్రాలు థియేటర్ల ముందుకొచ్చినా.. ఏ ఒక్కటీ కనీస వసూళ్లని కూడా రాబట్టలేకపోయింది. అనువాదాలు సొమ్ము చేసుకున్నాయి.. ఈ మేలో తెలుగు చిత్రసీమకి కూడా కాస్తోకూస్తో ఊపిరిపోసినవి అనువాద చిత్రాలే. మే రెండో వారంలో సూర్య 'వీరభద్రుడు' సినిమాతో.. మూడో వారంలో మోహన్‌లాల్ 'దృశ్యం 3'తో బాక్సాఫీస్ బరిలో సందడి చేశారు. నిజానికి వీటికి తెలుగులో సరైన ప్రచారం లేకున్నా... రివ్యూల పరంగా మిశ్రమ స్పందన లభించినా.. చెప్పుకోదగ్గ స్థాయిలో టికెట్లు తెగడం, మంచి వసూళ్లు రాబట్టడం విశేషం. కాస్త కంటెంట్ ఉన్న సినిమా పడి.. దానికి స్టార్ బలం కూడా తోడైతే ఎండల్నీ, ఐపీఎల్‌నీ లెక్క చేయకుండా జనాలు థియేటర్లకు వస్తారనడానికి ఈ అనువాదాలు నిదర్శనంగా నిలిచాయి. ఇక ఆఖరి వారంలో అర్జున్, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో నటించిన అనువాద చిత్రం 'బ్లాస్ట్'కు ప్రేక్షకుల నుంచి మంచి మౌత్ టాక్ లభిస్తోంది.

ఎప్పటికీ మీరే నా హీరో: మహేశ్‌బాబు పోస్టు

తన తండ్రి, నటుడు దివంగత కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్‌బాబు ఎమోషనల్ పోస్టు పెట్టారు. 'ఎప్పటికీ మీరే నా హీరో. హ్యాపీ బర్త్ డే నాన్నా' అంటూ తండ్రిపై ప్రేమను వ్యక్తం చేశారు. మహేశ్ సతీమణి నమ్రతా శిరోద్కర్ కూడా కృష్ణను స్మరించుకున్నారు. ఎప్పుడూ ప్రేమతో మిమ్మల్ని తలచుకుంటూనే ఉంటామంటూ పోస్టు చేశారు

కృష్ణ సేవలు చిరస్మరణీయం: సీఎం చంద్రబాబు

కృష్ణను స్మరించుకుంటూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. "తెలుగు సినీ పరిశ్రమకు నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా విశిష్ట సేవలందించిన పద్మభూషణ్ కృష్ణ గారి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నా. నూతన సాంకేతికతలను పరిచయం చేస్తూ సినీ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. అభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన ఆ మహానటుడికి ఘన నివాళులు" అని పేర్కొన్నారు.

ఇండస్ట్రీ సమస్యలు.. దాసరి దారి చూపారు.. హీరోలకు మంచు మనోజ్ విజ్ఞప్తి

ప్రస్తుతం ఇండస్ట్రీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దర్శకరత్న దాసరి నారాయణరావు ఎప్పుడో దారి చూపారని మంచు మనోజ్ అన్నారు. దాసరి నారాయణరావు సమాధి దుస్థితి చూసి చలించిపోయిన ఆయన తన టీమ్‌తో కలిసి శుభ్రం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తన సతీమణి మౌనికతో కలిసి దాసరి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "గురువుగారు దాసరి వర్ధంతి అన్న సంగతి నాకూ గుర్తులేదు. చిత్రపురి కాలనీ వైపు వస్తుంటే, ఆ దారిలో గురువుగారి విగ్రహం ఉంటుంది. అది చూడగానే ఆయన కుటుంబం గుర్తు వచ్చింది. ఈలోగా ఆయన సమాధి పరిస్థితి తెలుసుకుని నా టీమ్‌తో కలిసి ఉదయాన్నే వచ్చేశా. అందరూ ఎంతో శ్రమించారు"

"దాసరిగారు గొప్ప దర్శకుడు. స్క్రీన్‌ప్లే రైటర్. ఎడిటింగ్, మ్యూజిక్, డైలాగ్స్ ఇలా అన్నింటిపైనా పట్టు కలిగిన వ్యక్తి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయనొక ఇనిస్టిట్యూట్. ఆయన ఎన్నో గొప్ప సినిమాలు తీశారు. సోషల్, కమర్షియల్, మహిళా ప్రాధాన్యమున్న చిత్రాలు రూపొందించారు. 'దాసరి పని అయిపోయింది' అని టాక్ వినిపించిన ప్రతిసారీ కొత్తదనంతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం మనం

థియేటర్స్ సమస్యలంటూ మాట్లాడుకుంటున్నాం. కానీ, నాకు తెలిసి గురువుగారు ఎప్పుడో దీనికి ఓ మార్గం చూపించారు. ఏడాదికి పది నుంచి పదిహేను సినిమాలు చేస్తూ.. ఎంతో మందికి ఉపాధి లభించేలా చేశారు. ఎప్పుడో ఓ సినిమా చేయటం కాదు.. ఎప్పుడూ సినిమా చేయాలని దాసరి అనేవారు. ఇకపై నాతో సహా అందరూ హీరోలు వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేయాలని కోరుతున్నాను. ఆ బాధ్యత అందరిపైనా ఉంది. దాసరి ఘాట్‌ను పార్క్‌లా కాకుండా చుట్టు పక్కల పిల్లలు ఆడుకునేలా తీర్చిదిద్దితే బాగుంటుందని అనుకుంటున్నా" అని అన్నారు.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com